వడ్డె ఓబన్నకు నివాళి

జూబ్లీహిల్స్,జనవరి11: వడ్డెరల ఆశాజ్యోతి వడ్డె ఓబన్న జయంతిని గురువారం జూబ్లీహిల్స్‌లోని ఎస్‌పీ ఆర్‌హిల్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం నాయకులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 1: రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్, లక్ష్మిగూడ, దుర్గానగర్, ఆరాంఘర్, ఉడ్డెంగడ్డ ప్రధాన రహదారిలో విద్యుత్ స్తంభం సంగం విరిగి ఒక పక్కకు ఒరిగి ప్రమాదకరంగా ఉంది. ఈ మార్గం గుండా ప్రయాణిస్తున్న ప్రయాణికులు తరుచూ ప్రమాదాలకు గురువుతున్నారు. ఈ విషయంపై స్థానికులు విద్యుత్ అధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించినా అధికారులు పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

బంజారాహిల్స్,జనవరి 11: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని గాయత్రీహిల్స్‌లో శ్రీ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు గురువారం ఉత్సాహంగా జరిగియి. పెద్ద సంఖ్యలో మహిళలు రంగురంగుల ముగ్గులు వేశారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమం లో స్థానిక నేతలు బోజిరెడ్డి, రాఘవులు, లీలా రమేశ్, వెంకటేశ్ యాదవ్, శివ కొమ్మినేని, భరత్‌భూషణ్, వాణి, రాజు పాల్గొన్నారు.

ఖైరతాబాద్ జోనల్ కార్యాలయం ఆవరణలో..

ఖైరతాబాద్, జనవరి 11: భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బల్దియా మహిళా సిబ్బందికి గురువారం ఖైరతాబాద్ జోనల్ కార్యాలయం ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సంఘం అధ్యక్షులు శంకర్ ప్రారంభించారు. మొదటి బహుమతిని సర్కిల్ 17 ఉద్యోగిణి గంగుబాయి గెలుచుకోగా, ద్వితీయ, తృతీయ బహుమతులను నందిని, మాధవిలు సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు మోహన్‌దాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగభూషణం, కార్యదర్శి యాదగిరి, బాలరాజ్, వెంకట్ స్వామి, రాజు పాల్గొన్నారు.

గాయత్రీహిల్స్‌లో ముగ్గుల పోటీలను తిలకిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్, తదితరులు

నేడు సూర్య భగవాన్ ఆలయంలో..

బండ్లగూడ,జనవరి 11: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అత్తాపూర్ రాంబాగ్‌లోని సూర్య భగవాన్ ఆలయంలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బోయ రమేశ్ తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి మహిళలు హాజరు కావాలన్నారు.

ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో ముగ్గుల పోటీల విజేతలతో యూనియన్ నేతలు

శ్రీనిధిలో సంక్రాంతి సంబురాలు

వెంగళరావునగర్, జనవరి 11: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జవహర్‌నగర్ శ్రీనిధి కిడ్స్ క్యాస్టల్ పాఠశాలలో సంక్రాంతి సంబురాలు ఘనంగా జరిగాయి. సంప్రదాయబద్ధంగా బాలురు లాల్చి,పైజామాతో, బాలికలు ఓణీలను ధరించి ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచారు. గంగిరెద్దుల ఆటలు,హరిదాసుల కీర్తనలు,గొబ్బెమ్మలు,ముగ్గులతో సంక్రాంతి రంగవల్లులతో కళకళలాడింది. చిన్నారులు పై భోగి పళ్లు వేసి ఆశీస్సులు అందించారు.భోగి మంటలు వేసి సంక్రాంతి విశిష్టతను చిన్నారులకు తెలియజెప్పారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొల్లి లక్ష్మణ్,కృష్ణవేణి,ప్రిన్సిపాల్ గీతా,వైస్ ప్రిన్సిపాల్స్ విమల,రాజేశ్వరీ,ఇన్‌చార్జి అనిత రావ, పూర్ణిమ,కోఆర్డినేటర్ సాయిరాం,ఉపాధ్యాయ బృందం తదితురులు పాల్గొన్నారు.

ద్వారకానగర్ కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాగంటి

పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తాం

బంజారాహిల్స్,జనవరి 11: షేక్‌పేట డివిజన్ పరిధిలోని ద్వారకానగర్ కాలనీలోని పెండింగ్ సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తెలిపారు. గురువారం కాలనీకి చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యేను కలిసి సమస్యలను వివరించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలైన్లకు సంబంధించిన కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్, శ్రీనివాస్, సాయిగౌడ్, రామకృష్ణ, కార్తీక్, వివేక్, శ్రీనివాస్, బాబు, నిఖిల్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి సహకార సంఘం కృషి

రైతులకు రుణాల చెక్కులు పంపిణీ చేస్తున్న చైర్మన్ సతీశ్ తదితరులు

శంషాబాద్ రూరల్, జనవరి 11: రైతుల సంక్షేమానికి సహకార సంఘం కృషి చేస్తున్నదని మల్కారం సహకార సంఘం చైర్మన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బుర్కుంట సతీశ్ అన్నారు. గురువారం మండలంలోని మల్కారం సహకార సంఘం ఆధ్వర్యంలో నాబార్డ్ ద్వారా రైతులకు కోటి 43 లక్షల స్వల్ప, దీర్ఘకాలిక రుణాల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా చేయాలనే లక్ష్యంతో స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు ఇచ్చి ఆదుకుంటున్నట్లు చెప్పారు.

కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్లు బాల్‌రాజ్‌గౌడ్, రెడ్యానాయక్, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందించడమే లక్ష్యం

శంషాబాద్ రూరల్, జనవరి 11: ప్రజాపాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కస్తూరి నరేందర్ ముదిరాజ్ అన్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజాపాలన దరఖాస్తులను పట్టణంలోని గౌతమి కళాశాలలో కంప్యూటరీకరణ చేస్తున్నారు. గురువారం ఆ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో 15,347 దరఖాస్తులు వచ్చిన్నట్లు తెలిపారు. పరిశీలించిన వారిలో శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, కౌన్సిలర్ సంజేయ్‌యాదవ్, మైలారం సులోచన, మాజీ సర్పంచ్ అంజయ్య,శేఖర్‌గుప్తతో పాటు పలువురు ఉన్నారు.

దరఖాస్తుల కంప్యూటరీకరణను పరిశీలిస్తున్న నరేందర్, తదితరులు

తాగునీటి సమస్య తీర్చిన ఘనత బీఆర్ఎస్‌దే..

బండ్లగూడ,జనవరి 11: బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలో తాగునీటి సమస్యలను తీర్చిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. పలు కాలనీలకు తాగునీటిని సరఫరా చేసేందుకు జలమండలి అధికారులు గురువారం ట్రయల్‌రన్‌ను నిర్వహించారు. మేయర్ మహేందర్‌గౌడ్,జలమండలి జనరల్ మేనేజర్ రవీందర్‌రెడ్డితో కలిసి పలు కాలనీల్లో నీటి సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో నిర్మించిన తాగునీటి రిజర్వాయర్ నుంచి కార్పొరేషన్ పరిధిలోని వీరభద్ర కాలనీ,సరస్వతీనగర్ కాలనీ,ఆదర్శనగర్,డీడీ కాలనీ,వినాయక్‌నగర్,యాదవ్‌మిత్ర కాలనీ తదితర కాలనీలో తాగునీటిని ట్రయల్‌రన్‌ను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో డిప్యూటి జనరల్ మేనేజర్ నారాయణ,మేనేజర్ శ్రీనివాస్,నాయకులు సురేశ్‌గౌడ్ ఉన్నారు.

ట్రయల్‌రన్‌లో భాగంగా తాగునీటి సరఫరాను పరిశీలిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్, జలమండలి జీఎం రవీందర్‌రెడ్డి

సీఐని సన్మానిస్తున్న ఎర్రగడ్డ శాంతిసంఘం ప్రతినిధులు

నేరాల అదుపునకు సహకరించాలి

ఎర్రగడ్డ, జనవరి 11: శాంతిసంఘం సమావేశాన్ని గురువారం ఎర్రగడ్డలో నిర్వహించారు. సంఘం చైర్మన్ నారాయణస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ అంశాల గురించి ప్రస్తావించారు. నేరాల అదుపునకు పోలీసులకు సహకరించాలని.. అన్ని పండుగలు శాంతియుతంగా జరిగేలా బాధ్యత తీసుకోవాలని సలహాదారు బాల్‌రెడ్డి, అధ్యక్షుడు గంట మల్లేశ్ పేర్కొన్నారు. అనంతరం సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్‌హెచ్‌ఓ పురేందర్‌రెడ్డిని కలిసి తాము తీసుకున్న నిర్ణయాల గురించి వివరించారు. పరేందర్‌రెడ్డిని శాలువాతో సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో మల్లేశ్, బాల్‌రెడ్డి, నారాయణస్వామి,వైస్ చైర్మన్ సంజీవ, ఎండీ అజర్, సంఘం ప్రతినిధులు సి.నర్సింగరావు, ఎస్ఎన్ఎం పాషా, మహేందర్, డాక్టర్ రవీందర్, ఖలీల్, దారాసింగ్, జి.రఘు, అహ్మద్, శ్రీనివాస్, బిజ్‌మోహన్, జి.దయానంద్, వంశీకుమార్ పాల్గొన్నారు.

పండుగకు ఊరెళ్తున్నరా.. జర భద్రం

ఎర్రగడ్డ, జనవరి 11: సంక్రాంతి పండుగకు ఇంటిల్లిపాదితో కలిసి సొంతూర్లకు వెళ్లడంషరా మామూలే. అయితే.. ఊర్లకు వెళ్లే ప్రజలకు బోరబండ పోలీసులు పలు సూచనలు చేశారు. దీనికి సంబంధించి కరపత్రాలను ముద్రించి స్థానికంగా పంపిణీ చేశారు. ఠాణా ఆవరణలో గురువారం జరిగిన సమావేశంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ భూపాల్‌గౌడ్ మాట్లాడుతూ బంగారు ఆభరణాలు, నగదును బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలని సూచించారు. ఊర్లకు వెళ్లేవారు తమ నివాస ప్రాంతం పరిధిలోని ఠాణాకు సమాచారం ఇస్తే బాగుంటుందని,ఆవరణలో సీసీ కెమెరాలను అమర్చుకుంటే ఇంకా మంచిదని సూచించారు. ఇంటి ముందు అనుమానాస్పద వ్యక్తులెవరైనా ఉంటే సీసీ కెమెరాల ద్వారా గమనించి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు లేదా డయల్ 100కి సమాచారం ఇవ్వాలన్నారు.

డీఐ భూపాల్‌గౌడ్

సకాలంలో ఆస్తిపన్ను చెల్లించండి..

బిల్ కలెక్టర్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఉప కమిషనర్ రవికుమార్

బండ్లగూడ,జనవరి 11: సకాలంలో ఆస్తి పన్ను చెలించి నగర అభివృద్ధికి పాటు పడలని రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన సర్కిల్ కార్యాలయంలో బిల్ కలెక్టర్లతో ఆస్తి పన్ను వసూలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గత నెల రోజులగా వసూలు చేసిన ఆస్తి పన్నుల గురించి ఆరా తీశారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ.. ఆస్తిపన్ను చెల్లించని వారు వెంటనే చెల్లించాలన్నారు. లేనిచో బకాయి దారులపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని ఆయన హెచ్చరించారు.

దళితుల జీవితాల్లో మార్పులు తీసుకురావాలి

హిమాయత్‌నగర్,జనవరి11: రాష్ట్రంలోని దళితుల జీవితాల్లో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి,రాష్ట్ర కార్యదర్శి,ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్ పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ అన్నారు. గురువారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో డీహెచ్ పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక ఉద్యమాలు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు డీహెచ్‌పీఎస్ ఎంతో కృషి చేస్తుందన్నారు.అనంతరం డీహెచ్ పీఎస్ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కె.యేసు రత్నం, నాయకులు ఉషశ్రీ, ఆరుట్ల రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం..

మణికొండ, జనవరి 11: అమావాస్యను పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని మణికొండ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఓలం యాదయ్య అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫీసు ఎదుట గురువారం అన్నదానం చేశారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

ఉచిత మెడికల్ కిట్లు..

ఖైరతాబాద్, జనవరి 11: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం ఉచితంగా మెడికల్, ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందజేసేందుకు కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్స్ ముందుకు వచ్చింది. ఖైరతాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ కిట్లను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, స్థానిక కార్పొరేటర్ విజయారెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు.

దరఖాస్తులు ఎక్కువ... సమయం తక్కువ

ఖైరతాబాద్, జనవరి 11: ప్రజాపాలనలో అభయహస్తం దరఖాస్తులు వెల్లువెత్తాయి. కానీ సరిపోను సిబ్బంది లేకపోవడంతో ఆన్‌లైన్ ఎంట్రీ నత్తనడకన సాగుతున్నది. ప్రస్తుతం ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో ఉన్నతాధికారుల చాంబర్లు తప్పా సిబ్బందికి సంబంధించిన చాంబర్లతో సహా ఖాళీగా ఉన్న ప్రతి గదిని డేటా ఎంట్రీకి వినియోగిస్తున్నారు. ఇప్పటికే తాత్కాలిక విధానంలో డిగ్రీ, ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులను డేటా ఎంట్రీకి తీసుకున్నారు. కాగా సిబ్బందికి సరిపడా ల్యాప్‌టాప్‌లు లేకపోవడంతో మొబైల్ ఫోన్‌లో డాటా ఎంట్రీ ప్రకియను చేపడుతున్నారు. దీంతో ఎంట్రీలో తప్పులు దొర్లితే లబ్ధిదారుడి సమాచారం ప్రభుత్వ పోర్టల్‌లోకి ఎక్కే అవకాశం ఉండదు.

ఆది, సోమవారాల్లో పండుగ ఉండడంతో టార్గెట్‌ను పూర్తి చేసేందుకు మూడు షిఫ్టుల్లో పనిచేయిస్తున్నారు. అయితే ఈనెల 17వరకు పూర్తి చేయాలనే టార్గెట్ పూర్తి కావడం కష్టంగానే కనిపిస్తుంది.దీని తోడు సర్వర్ అంతరాయం కలిగిస్తున్నది.

నిర్ణీత సమయంలోనే పూర్తి చేస్తాం

ఖైరతాబాద్ జోన్‌లో సుమారు 3.50లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్లకు సంబంధించిన దరఖాస్తులు ఆదివారం నాటికి పూర్తి చేసే ప్రయత్నాలు చేస్తున్నాం. సాంకేతిక సమస్యను పరిష్కరించేందుకు ఐటీ విభాగం సహకారంతో వెనువెంటనే పరిష్కరిస్తున్నాం. కచ్చితత్వమైన డేటా ఎంట్రీ కోసం ప్రత్యేక పర్యవేక్షణ అధికారులను నియమించాం. నిర్ణీత సమయంలోనే డేటా ఎంట్రీని పూర్తి చేస్తాం.

–వెంకటేశ్ దోత్రే, జోనల్ కమిషనర్, ఖైరతాబాద్

ల్యాప్‌టాప్ మాయం..

బంజారాహిల్స్,జనవరి 11: హాస్టల్ గదిలోనుంచి ల్యాప్‌టాప్ మాయమైన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. షేక్‌పేటలోని డీమార్ట్ సమీపంలోని లక్ష్యా పీజీ మెన్స్ హాస్టల్‌లో ఉంటున్న గణేశ్ దువ్వా అనే యువకుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తుంటాడు. ఈనెల 9న అర్ధరాత్రి దాటేదాకా తన గదిలో ల్యాప్‌టాప్‌పై పనిచేసిన గణేశ్ తర్వాత దాన్ని పక్కన పెట్టి నిద్రపోయాడు. మరుసటిరోజు నిద్రలేచి చూసేసరికి గదిలో ఉండాల్సిన ల్యాప్‌టాప్ కనిపించలేదు. హాస్టల్‌లోని అందరినీ అడిగినా ఆచూకీ తెలియకపోవడంతో గణేశ్ గురువారం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మార్చి 10న ఉత్తమ పరిశోధన పత్రం పోటీలు

ఖైరతాబాద్, జనవరి 11: సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్‌తెలంగాణ, నిమ్స్ సంయుక్తాధ్వర్యంలో మార్చి 10న ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు జాతీయ స్థాయి పరిశోధన పత్రం పోటీలను నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మైక్రో,స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు పోటీలకు సంబంధించిన బ్రోచరన్లను గురువారం నిమ్స్‌లో డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ అనుకపూర్, మాజీడీన్ డాక్టర్ రామ్మూర్తి, డాక్టర్ జ్యోత్స్న, సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ అకాడమిక్ డైరెక్టర్ దామోదర్ నాయుడు, సీఈవో శ్రీనివాస్‌తో కలిసి ఆవిష్కరించారు.

బ్రోచర్ల ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ డాక్టర్ బీరప్ప డాక్టర్ అనుకపూర్, రామ్మూర్తి

గంజాయి రవాణా..ముగ్గురు అరెస్ట్

బండ్లగూడ,జనవరి 11: ఒరిస్సా కేంద్రంగా హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తున్న ముగ్గురిని శంషాబాద్ జోన్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించిన వివరాలను సూపరింటెండెంట్ సత్యనారాయణ వెల్లడించారు.ఒరిస్సా మల్కాన్‌గిరికి చెందిన హరిశంకర్ గత కొన్ని సంవత్సరాలుగా హైదరాబాద్‌లో ఉంటూ సెంట్రింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో హరిశంకర్‌కు లంగర్‌హౌజ్‌కు చెందిన మహేశ్‌కుమార్, హైదర్‌షాకోట్‌కు చెందిన వరుణ్‌కుమార్‌తో పరిచయం ఏర్పడింది.కాగా హరిశంకర్ గంజా యి అమ్మకం ద్వారా డబ్బులు సులువుగా సంపాదించాలనే కోరికతో తన ఇద్దరి స్నేహితులతో కలిసి గంజాయి అమ్మేందుకు ప్రణాళిక వేశాడు. గత కొంత కాలంగా వారు గంజాయిని నగర శివారు ప్రాంతమైన లంగర్‌హౌజ్,బండ్లగూడ,నార్సింగి తదితర ప్రాంతాల్లో యువతకు అమ్మి సొమ్ము చేసుకునేవారు.ఈ క్రమంలో వారు రెండు బైక్‌లలోని సీట్లను తొలగించి అందులో గంజాయి ప్యాకెట్లను నింపుకుని ఒరిస్సా నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది.గురువారం శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు పోలీస్ అకాడమీ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు.హరిశంకర్ తన బైక్‌పై వస్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు.పోలీసులు వెంబడించి పట్టుకుని విచారించగా అసలు విషయం తెలిసింది.వారి నుంచి 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.దీని విలువ రూ.3లక్షల వరకు ఉంటుందన్నారు. వీరిపై మరిన్ని కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

పట్టుకున్న గంజాయి, నిందితులతో శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు

ఇద్దరు అదృశ్యం..

మమత(ఫైల్)

శంషాబాద్ రూరల్, జనవరి 11: మహిళ అదృశ్యమైన సంఘటన గురువారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ శ్రీనాథ్ తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని బహదూర్‌గూడ గ్రామ పరిధిలోని కేఎల్ఆర్ అక్బర్ ఫాంహౌజ్‌లో వాచ్‌మన్‌గా పని చేస్తున్న లక్ష్మీనారాయణ బుధవారం వ్యక్తిగత పని నిమిత్తం సమీపంలో ఉన్న తుక్కుగూడకు వెళ్లాడు. అనంతరం తిరిగి వచ్చి చూడగా ఇంట్లో ఉన్న అతడి భార్య మమత(22) కనిపించలేదు. ఎక్కడ వెతికినా ఫలితం లేదు. ఫామ్‌హౌజ్‌లో పని చేసే యువకుడిపై అనుమానం ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మతిస్థిమితంలేని వ్యక్తి..

భాస్కర్(ఫైల్)

మండలంలోని పెద్దషాపూర్ తండా గ్రామానికి చెందిన సభావత్ భాస్కర్(32) మతిస్థిమితం లేదు. ఇంట్లోను ఉండేవాడు. గత నవంబర్ నెల 27న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహాలు లభ్యం

ఖైరతాబాద్, జనవరి 11 : ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. ఏఎస్ఐ శ్రీరాములు కథనం ప్రకారం....ఖైరతాబాద్‌లో రైల్వేగేటు సమీయంలోని బుడిగ జంగం బస్తీలో 60-70 ఏండ్ల వయస్సుగల వ్యక్తి విగతజీవిగా పడి ఉండాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు పసుపు రంగు టీషర్టు,నలుపు రంగు ట్రాక్‌ప్యాంట్ వేసుకొని ఉన్నాడు. మరో ఘటనలో ప్రసాద్ ఐమాక్స్ థియేటర్ ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌పై 55 నుంచి 60 ఏండ్ల వయస్సుగల వ్యక్తిని పరీక్షించగా మృతి చెంది ఉన్నాడు. ఈ మేరకు మృతదేహాలను గాంధీ మార్చురీకి తరలించారు.